17-3-5




# చిత్రాల్లో సన్నివేశాలు

ఏ చిత్రమైనా ప్రేక్షకులకు అతిసహజంగా వుండి, అతుకుల బొంతలాగా లేకుండా వుండాలంటే అందులో సన్నివేశాలు అతిసహజంగా వుండాలి. ఒక్కొక్కప్పుడు కథలో ప్రత్యేకత, కొత్తదనం లేకపోయినా సన్నివేశాలు అతి సహజంగా, పొందికగా వుండేటట్టు ఏర్పాటుచేస్తే ఆ చిత్రం రాణించి తీరుతుంది. తరుచుగా సన్నివేశాల కూర్పు బాగా లేకనే కథావస్తువు ఎంత గొప్పదైనా చిత్రం చివరకు పేలవంగా తయారవుతుంది.

'సన్నివేశం' అంటే సామాన్య పాఠకుడికీ, ప్రేక్షకుడికీ అర్థమయేటందుకు 'సంఘటన' అని అర్థం చెప్పుకోవచ్చు. ఈ విషయం తేలికగా అర్థమయేటందుకు ఉదాహరణ పూర్వకంగా వివరిస్తాను. ఈ మధ్యనే విడుదలయిన అపూర్వ సహోదరులు చిత్రం తీసుకోండి. అందులో కాంచన అనే అమ్మాయిని పట్నంలో పెరిగిన విజయుండు నాట్యశాలలో చూసి మోహిస్తాడు. ఆ అమ్మాయి కూడా తిరిగి ప్రేమిస్తుంది. అదే నాట్యశాలలో ఆమెను చూసిన రాజు (వయస్సు మళ్లిన, జమీందారో, మహారాజో స్పష్టంగా తెలియదు) కూడా ఆమెను కామిస్తాడు. రాజుగారు ఆపిల్ల తండ్రిద్వారా జరిపిన రాయబారాలు విఫలమవుతాయి. చివరకు ఆ రాజు ఆమెను బలాత్కరించటానికి స్వయంగా బయలుదేరి వస్తాడు. అతడు బలాత్కరించటానికి వచ్చాడని తెలుసుకున్న కాంచన దాసీ దానికి తన వేషం వేసి, దాసీ వేషం తను వేసుకుని పారిపోతుంది. వయస్సు మళ్ళిన రాజుగారు దరాగా మేడ మీదకి వెళ్ళిపోతారు. ఇక కాంచన ఆయన సేవకుల్ని తప్పించుకుందుకు నానా అవస్థలూపడి వాళ్ళతో తను పావుగంటసేపు గెంతి, లడ్డూ పాట అరవం, కన్నడం, తెలుగు, మళయాళీ, హిందీ భాషల్లో అరగంటసేపు పాడి చివరకు అందరినీ గదిలో పెట్టి గొళ్ళెంపెట్టి పారిపోతుంది. ఈ సంఘటనను విమర్శనాదృష్టితో చూస్తే ఇందులో ఎన్నిలోపాలున్నదీ తెలుస్తుంది. మేడమీదకు వెళ్లిన రాజుగారికి దాసీ పడుచు కాంచనకాదు అనే విషయం తేల్చుకుందుకు ఎంతసేపు పట్టాలి? పైగా మేడక్రింద అయిదుభాషల్లో గానా బజానా జరుగుతూంటే తన సేవకులు యింత గడబిడ ఎందుకు చేస్తున్నారో తెలుసుకోకుండా వూరుకుంటాడా? కాంచన తన సేవకుల్నందర్నీ గదిలో తాళంవేసి పారిపోయినాక, రాజుగారు అప్పుడు తన కార్యక్రమంలోకి దిగుతారు. ఈ పావుగంటలోనూ, రాజుగారుపైన ఏం చేసినట్టూ? కాంచనకి తన యందు సుముఖత లేదని తెలుసుకున్న రాజుగారు ఆ వ్యవహారం ఏమిటో సరాసరి తేల్చుకోకుండా, నీళ్లు నములుతూ కూర్చుంటాడా? ఈ సన్నివేశం వాస్తవికతకు దూరంగావుంది. వాసన్ గారు అన్నిభాషల వాళ్ళనూ మెప్పించదల్చుకోవచ్చు. పాటకపుజనాన్ని రంజింపచేద్దామనుకోవచ్చు. ప్రభాత్ వారి 'అద్మీ' తరువాత అన్ని భాషల్లో పాట యీమధ్య నెప్పుడూ రాలేదు గనుక తాను మళ్ళీ ప్రవేశపెట్టనూవచ్చు. కాని



17-3-50

17-3-50

సన్నివేశంమాత్రం అలాగ వుండకూడదు. కేమేరా ఒక్కొక్కసారి ఊర్ధ్వ ముఖంగాకూడా తిప్పి అక్కడ రాజుగారు ఏం చేస్తున్నారో, ఆయనను మారువేషంలోవున్న దాసీ ఎన్ని బాధలు పెడు తూందోకూడా మాపిస్తే యీ సన్నివేశం యింత అసహజంగా తయారుకాదు.

ఇలాంటి లోట్లు, యింతకన్న పెద్దవి మన చిత్రాల్లో తరుచు చూస్తునే వుంటాం. ఇవి సంఘటనలు ఎలాగ చూపెట్టాలో తెలియకనూ, ఒక్కొక్కప్పుడు తెలిసినా ప్రజల్ని అమితంగా మెప్పించుదామనో, లేక అసందర్భాలతోనే ప్రజల్ని మభ్య పెడుదామనో చిత్ర నిర్మాతలు కావాలని యీ సన్నివేశాల్ని యిలా తయారు చేస్తారు. అటువంటి సన్నివేశాలు నిర్మాతల మొండితనాన్ని, చేతగానితనాన్ని వ్యక్తపరుస్తూ వుంటాయి.

ఈనాటి హిందీ చిత్రాల్లో యీ అసభ్య సన్నివేశాలు మరీ ఎక్కువ. కథానాయికని, నాయకుణ్ణి ఒకరి కొకర్ని పరిచయం చెయ్య టానికి నిర్మాతలు ఎన్ని అవస్థలైనా పడతారు. హీరో సైకిలుమీద, హీరోయిను కారుమీద ఒకరికొకరు ఎదురుగావచ్చి గుద్దుకుంటారు. కాని హీరోకి దెబ్బలు తగలవు. హీరోయిను ఆ కంగారులో కారును ఏచెట్టుకో మళ్ళీ గుద్దిస్తుంది. హీరో లేచి, ఆమెను జాగ్రత్తగా వాళ్ళింటికి చేరుస్తాడు. ఆతర్వాత ఆమెకు ఒంట్లో ఎలాగ ఉందో కనుక్కొందుకు రోజూ ఆమె యింటికి వెడుతూ వుంటాడు. ఒకరోజున ఆమెకు చిరాకుగావుండి హీరోను లెంపకాయ కొడు తుంది. అయినా యింకా ఆ ప్రేమ అలా పెరుగు తూనే వుంటుంది. చిత్రం పూర్తయే సరికి చాలా ఆశ్చర్యకరమైన విషయం జరుగుతుంది - వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారు. ఇలాంటి చిత్రాల్లో చూసే సన్నివేశాలకీ, మానవుడి జీవితంలో రోజూ జరిగే సంఘటనలకూ ఏమీ సంబంధం వుండదు. అందుకే యీ చిత్రాలు సహజంగా వుండక అతికినట్టుగా వుంటాయి.

కథ, సన్నివేశాలతోబాటు కథాగమనం గురించి కూడా నిర్మాతలు శ్రద్ధవహించాలి. ఈ కథాగమనాన్ని యింగ్లీషులో 'టెంపో' అంటారు. చిత్రంలో అన్ని సంఘటనలూ ఒక వేగంలో తీయబడవు. కొన్ని సంఘటనలు చురుకుగానూ, కొన్ని మందంగానూ వుంటాయి. వీటిని క్విక్ టెంపో; స్లో టెంపోలంటారు. గుణ సుందరి కథలో మొట్ట మొదటిసీను గుణ ఏడుపు, ప్రార్థన, పార్వతీ పరమేశ్వరులు ఆలకించడం, గుణసుందరి వృత్తాంతం చర్చించటం అంతా స్లో టెంపోలో నడచింది. అపూర్వ సహోదరులు చిత్రంలో భూపతి కోట ముట్టడింపు, తగల బెట్టడం, కవల పిల్లలను రహస్య మార్గంగా రక్షించటం యిదంతా క్విక్ టెంపోలో నడిచింది.

కథలో సంఘటనలనుబట్టి ఎక్కడ ఏ టెంపో వుండాలో నిర్మాతలు నిర్ణయించుకోవాలి. సంఘటనలను మెల్లిగా దొర్లించ వలసినచోట గబగబ నడిపించి, త్వరగా నడవవలసిన చోట యీడుస్తూ నడిపించినట్టయితే టెంపో చెడి పోతుంది. ఏ కథను బట్టి ఆ చిత్రానికి కథా గమనం ఏర్పాటు చేసుకోవాలి.

ఒక చిత్రంలో హీరో చనిపోయినాడని వార్త వస్తే హీరోయిను ఒక పావుగంటసేపు యీడుస్తూ, ఏడుస్తూ, పాటపాడి, ఆ తర్వాత మెల్లిగా సామానంతా సర్దుకుని హీరో చనిపో యిన వూరు వెడుతుంది. ఎవరైనా హృదయ విదారకమైన వార్తవింటే పాటపాడుతారా? ఆ చిత్రంలో ఆ సన్నివేశం గాని, ఆ టెంపో గాని సరియైనవి కావు.

చిత్రాల్లో సన్నివేశాలు, కథాగమనం సరిగ్గా వుండాలంటే కథకుడూ, దర్శకుడు, సినేరియో రచయిత—ముగ్గురూ దగ్గరవుండి బాగా సంప్రదిం చుకుని సినేరియో జాగ్రత్తగా తయారుచేస్తే పై లోపాలు చిత్రాల్లో రాకుండా చేసుకోవచ్చును. ముగ్గురూ ఒకడే అయితే తన బుద్ధికి తోచినదే సినేరియోగా తయారుచెయ్యక, ఆ పరిశ్రమలో అనుభవజ్ఞులను సంప్రదించటం చాలా ముఖ్యం. షూటింగ్ ప్రారంభించేనాటికి సమగ్రమైన, సరియైన సినేరియో కాగితంమీద తీయబోయే చిత్రంయొక్క ప్రతిరూపు. ఉత్తమ చిత్రాలు తీయదలుచుకున్న నిర్మాతలు సన్నివేశాలు, కథాగమనం గురించి ఎక్కువ శ్రద్ధ చూపాలి.

"సుబుద్ధి"



17-3-50